క్లుప్తంగా

నేడు బాలాజీ కళాశాలలో క్యాంపస్ డ్రైవ్

పెందుర్తి: స్థానిక బాలాజీ డిగ్రీ కళాశాలలో మ్యాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు కళాశాల కరస్పాండెంట్ కె.నాగేశ్వరరావు బుధవారం తెలిపారు. పదో తరగతి, ఆ పై విద్యార్హతలున్నవారు ఇంటర్వ్యూలకు హాజరు కావచ్చని పేర్కొన్నారు. అన్ని ధ్రువపత్రాలతో ఉదయం 9 గంటలకు కళాశాలకు చేరుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 98667 07299 ఫోన్ నంబర్లో సంప్రదించవచ్చన్నారు.

అప్పన్నకు ఘనంగా నిత్యకల్యాణం



నిత్యకల్యాణంలో కంకణధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ బేడామండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టింపజేసి, ఉదయం 9.30 నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని జరిపారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం శేషవస్త్రాలను అందించారు.

కథలు విందాం.. నీతి నేర్చుకుందాం..



ధ్యానం చేస్తున్న విద్యార్థులు

పెందుర్తి: వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో బుధవారం కథలు చదవడం, రాయడం, చెప్పడంపై విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. చిన్నారులకు నీతి కథలను చదివి వినిపించారు. అందులో దాగి ఉన్న నీతిని వారి ద్వారా రాబట్టారు. నిత్య జీవితంలో నీతినిజాయితీలే పెట్టని కోటగా నిలుస్తాయని వివరించారు. సామూహిక పుస్తక పఠనం చేయించారు. ఇంగ్లిష్ భాషపై పట్టుసాధించేందుకు మెళకువలు నేర్పించారు. పలు ఆటలు ఆడించారు. ధ్యానం ఆవశ్యకతను తెలిపారు. ముందుగా ఎన్టీఆర్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. గ్రంథాలయాధికారి బి.సూర్యకళ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో గ్రంథాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, పలువురు పాఠకులు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెదగంట్యాడ: పెదగంట్యాడ 11కేవీ ఫీడర్, ఏపీహెచ్‌బీ ఫీడర్ పరిధిలో ప్రీమాన్సూన్ నిర్వహణ, మరమ్మతు పనులు చేపట్టనున్న నేపథ్యంలో ఈ నెల 30న విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనున్నట్లు ఈపీడీసీఎల్ జోన్–2 ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బీకే నాయుడు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నేపథ్యంలో పెదగంట్యాడ ఫీడర్ పరిధిలోని గొడ్డువానిపాలెం, దుర్గవానిపాలెం, నెల్లిముక్కు, సీతానగరం, పెదగంట్యాడ మెయిన్‌రోడ్డు, బర్మాకాలనీ, బాబు జగ్జీవన్‌రాం నగర్, రైతు బజార్ ఏరియా, ఏపీహెచ్‌బీ ఫీడర్ పరిధిలో ధర్మాల వీధి, ఎస్సీ కాలనీ, అరుణ కాంప్లెక్స్, నీలాపు వీధి, గొడ్డువానిపాలెం నోవాస్–పోర్టు రోడ్డు ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ విద్యుత్ సరఫరాలో అంతరాయం తప్పదన్నారు. ఆయా ప్రాంతాల వినియోగదారులు ఈ అసౌకర్యాన్ని గమనించి, తమ సిబ్బందికి సహకరించాలని కోరారు.

ఘనంగా ఎన్టీఆర్ జయంతి వేడుకలు



పేదలకు వడ్డన చేస్తున్న మాజీ జెడ్పీటీసీ జగన్నాథరావు, నాయకులు

పరవాడ: దివంగ మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు 102వ జయంతి కార్యక్రమాన్ని పరవాడ సంతబయలులో టీడీపీ నాయకులు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఎన్టీఆర్ కాంస్య విగ్రహానికి పరవాడ జెడ్పీటీసీ సభ్యుడు పైల జగన్నాథరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అతి తక్కువ కాలంలో రాజకీయాల్లో ప్రవేశించి, అధికారంలోకి వచ్చి ప్రజలకు మెరుగైన పాలన అందించారని కొనియాడారు. అనంతరం పేదలకు పులిహోర, పండ్లు పంపిణీ చేశారు. టీడీపీ నాయకులు బొడ్డపల్లి అప్పారావు, పైల చినఅక్కునాయుడు తదితరులు పాల్గొన్నారు.

సంప్రదాయ పంటలైన వరి, కూరగాయల సాగు నుంచి పరవాడ మండల రైతులు సరుగుడు, యూకలిప్టస్ వైపు మొగ్గు చూపుతున్నారు. నీటి ఎద్దడి, పెట్టుబడి వ్యయం కారణంగానే ఈ నిర్ణయం తీసుకుంటున్నారు. అచ్యుతాపురంలో పేపర్ మిల్లు రాక ఇక్కడి రైతులకు మరింత మేలు చేకూర్చింది. ప్రస్తుతం మండల పరిధిలో ఏకంగా 2,520 ఎకరాల్లో సరుగుడు, యూకలిప్టస్ సాగు జరుగుతోంది



గొర్లివానిపాలెంలో కోతకు సిద్ధంగా ఉన్న సరుగుడు తోట



గొల్లలపాలెంలో ఏపుగా పెరుగుతున్న యూకలిప్టస్ మొక్కలు

రైతుల పాలిట.. కలపతరువు!

నరుగుడు, యూకలిప్టస్ సాగుకు రైతుల ఆసక్తి

నీటి ఎద్దడి, పెట్టుబడి వ్యయం నుంచి ఉపశమనం

పరవాడ మండలంలో 2,520 ఎకరాల్లో మొక్కలు

పరవాడ: అనేక వ్యయ ప్రయాసలకు ఓర్చి పండించిన వరి, కూరగాయల పంటలతో ఆశించిన ఆదాయం రాని పరిస్థితి. దీంతో తక్కువ పెట్టుబడితో అధికాదాయం పొందే సరుగుడు, యూకలిప్టస్ సాగుపై రైతాంగం మక్కువ చూపుతోంది. ఈ పంటలకు ఏటా పెట్టుబడి వ్యయం ఉండదు. ఐదారేళ్లలో చెట్లు కోతకు వచ్చి, అధికాదాయం పొందవచ్చన్న ఉద్దేశంతో మండలంలో అనేక గ్రామాల రైతులు వీటి సాగుపై ఆసక్తి చూపుతున్నారు. సరుగుడు, యూకలిప్టస్ కర్రకు ఈ మధ్య కాలంలో పెరిగిన డిమాండ్ కూడా ఇందుకు దోహదపడుతోంది.

పెట్టుబడి తగ్గి.. ఆదాయం పెరిగి..

గ్రామీణ ప్రాంతాల్లో తక్కువ పెట్టుబడితో అధిక **ఆదాయం పొందే ప్రత్యామ్నాయ పంటలపై రైతులు దృష్టి సారిస్తున్నారు. కూరగాయల పంట భూముల్లో సరుగుడు, యూకలిప్టస్ సాగు ఆరంభించారు. ఇటీవల కురిసిన వర్షాలకు మండలంలో గొర్లివానిపాలెం, జాజులవానిపాలెం, వెన్నలపాలెం, ఈ బోనంగి, పి.బోనంగి, రావాడ, తానాం, వాడచీపురుపల్లి, నాయుడుపాలెం, పెదముషిడివాడ గ్రామాల పరిధిలో గల మెట్ట ప్రాంతాల్లో 2,520 ఎకరాల్లో ఈ మొక్కలు వేశారు. వీటికి అధిక** పెట్టుబడులతో పనిలేదు. ఒకసారి మొక్కలు వేసి బతికిస్తే చాలు.. ఎలాంటి నీటి ఎద్దడి వచ్చినా తట్టుకోగలవు. మొక్క దశలో రెండు మూడు పర్యాయాలు గొప్పులు చేసి, గాబు(కలుపు) తొలగిస్తే ఐదారేళ్లలో పంట చేతికందుతుంది.

నీటి ఎద్దడి వల్లే..

ఇక్కడి రైతులు ఎక్కువగా చెరువులపై ఆధారపడి పంటలను సాగుచేసేవారు. వర్షాలు పడకపోతే కూరగాయలు ఎండిపోయి తీవ్రంగా నష్టపోయేవారు. అదే సరుగుడు, యూకలిప్టస్ పంటలైతే వర్షాభావ పరిస్థితుల్ని తట్టుకోగలవు. సరు**గుడు ఐదేళ్లకోసారి కోతకు వస్తుంది. మళ్లీ కొత్తగా పంటను వేసుకోవచ్చు. యూకలిప్టస్ ఒకసారి వేశాక ఐదేళ్లకు చేతికి వస్తుంది. చెట్లను నరికేశాక మళ్లీ మొదలు నుంచి అనేక చిగుళ్లు వచ్చి ఏపుగా పెరిగి, రెండో సారి కొత్తగా మొక్కలు నాటాల్సిన పనిలేదు. ఎలాంటి తెగుళ్ల ఇబ్బందులు ఉండవు. దీంతో గతంలో కూరగాయలు. అపరాలు పండే భూముల్లో నేడు సరుగుడు, యూకలిప్టస్ తోటలు దర్శనమిస్తున్నాయి.**

దళారుల బెడద తప్పింది

మండల పరిధిలో కూరగాయలు, అపరాలు, జీడి తోటల వలన ఆశించిన ఆదాయం రాకపోవడంతో మెట్ట ప్రాంతాల్లో కూడా సరుగుడు తోటలను పెంచుతున్నారు. గతంలో ఈ ప్రాంతంలో సాగు చేస్తున్న సరుగుడు, యూకలిప్టస్ పంటలను విక్రయించాలంటే రైతులు దళారులను ఆశ్రయించాల్సి వచ్చేది. దళారులు రైతుల వద్ద నుంచి కొనుగోలు చేసిన పంటలను లారీలపై రాయగడ, రాజమండ్రి ప్రాంతాల్లోని పేపరు మిల్లులకు సరఫరా చేసి లాభాలు ఆర్జించేవారు. ఇటీవల అచ్యుతాపురం ఎస్ఈజెడ్ ప్రాంతంలో ఏర్పాటు చేసిన పేపరు మిల్లుతో రైతులకు దళారుల బెడద తప్పింది. రైతులే నేరుగా కోసిన సరుగుడు, యూకలిప్టస్ చెట్లను పేపరు మిల్లుకు తరలించి అధికాదాయం పొందుతున్నారు.

మండల పరిధిలో వివరాలు

సాగు విస్తీర్ణం(ఎకరాల్లో)	
సరుగుడు	1945
యూకలిప్టస్	575
దిగుబడి(ఎకరాకు టన్నులు)	
ఇసుక నేలల్లో	90
మెట్ట భూముల్లో	89
ఆదాయం(టన్నుకు)	
సరుగుడు బాదులు	రూ.9 వేలు
సరుగుడు మీటర్ ముక్కలు	రూ.7 వేలు
యూకలిప్టస్	రూ.6 వేలు

కూరగాయల సాగుకంటే మేలు



నాకున్న 70 సెంట్లలో 6 నెలల క్రితం సరుగుడు వేశాను. రెండు నెలలు మొక్కలకు నీరందించి, రెండు సార్లు గొప్పులు తవ్వించాం. మొక్కలు ఏపుగా పెరుగుతున్నాయి. గతంలో అదే భూమిలో కూరగాయలు వేస్తే తెగుళ్ల కారణంగా వచ్చిన ఆదాయం పెట్టుబడులకూ సరిపోయేది కాదు. దీంతో విసిగిపోయి సరుగుడు మొక్కలు వేశాను.

– పైల సన్యాసిరావు, వెన్నలపాలెం

దళారుల బెడద తప్పింది



గతంలో సాగు చేసిన సరుగుడు, యూకలిప్టస్ పంటలు కోతకు వస్తే దళారులను ఆశ్రయించాల్సి వచ్చేది. తీవ్రంగా నష్టపోయేవాళ్లం. అచ్యుతాపురంలో ఏర్పాటు చేసిన పేపర్ మిల్లుతో దళారుల బెడద తప్పింది. కోతకొచ్చిన చెట్లను నేరుగా పేపర్ మిల్లుకు తరలిస్తున్నాం. కమీషన్ల బెడద లేని ఆదాయం చేతికొస్తుంది.

– రాయుడు అప్పారావు, రైతు, తానాం

వర్షాభావంతో ఇబ్బంది లేదు



చెరువులపై ఆధారపడి సాగు చేస్తున్న కూరగాయలు, వరి, అపరాల కంటే వర్షాభావ పరిస్థితులను తట్టుకునే సరుగుడు, యూకలిప్టస్ పంటలే మేలు. మెట్ట, ఇసుక నేలలకు ఈ మొక్కల పెంపకం చాలా అనుకూలం. తెగుళ్ల బెడద అసలే ఉండదు. సకాలంలో నీటి తడి అందితే చాలు. పెద్దగా శ్రమ లేకుండానే ఐదేళ్లకు పంట చేతికొస్తుంది.

– కాపుశెట్టి సత్యం, పెద స్వయంభూవరం

ఆకట్టుకున్న పుస్తక ప్రదర్శన



పుస్తకాలను చదువుతున్న విద్యార్థులు

సింహాచలం: అడవివరం గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా బుధవారం ఏర్పాటుచేసిన పుస్తక ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది. గ్రామస్తులు, విద్యార్థులు పెద్ద ఎత్తున తరలివచ్చి పుస్తక ప్రదర్శనను ఆసక్తిగా తిలకించారు. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారి ఎస్.వి.నరసింహం మాట్లాడుతూ గ్రంథాలయంలో బాల సాహిత్యంతో పాటు పోటీ పరీక్షలకు హాజరయ్యే వారి కోసం అవసరమయ్యే అన్ని రకాల పుస్తకాలు అందుబాటులో ఉన్నాయన్నారు. కార్మిక నాయకుడు సీహెచ్ఎస్ఎన్ రాజు మాట్లాడుతూ బాల్యదశ నుంచే విద్యార్థులు పుస్తక పఠనాన్ని అలవర్చుకోవాలని, గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు చిట్టి కథలు, హాస్య కథలు చెప్పారు. అనంతరం మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ 102వ జయంతిని ఘనంగా నిర్వహించారు.

పోటీతత్వంతోనే భవిష్యత్తులో రాణింపు



పెయింటింగ్ వేసిన మట్టి పాత్రలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

సబ్బవరం: స్థానిక శాఖా గ్రంథాలయంలో కొనసాగుతున్న వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా విద్యార్థులకు బుధవారం మట్టి కుండలపై పెయింటింగ్ పోటీలు నిర్వహించారు. విద్యార్థులను ప్రోత్సహించేందుకు ఇలాంటి పోటీలు అవసరమని గ్రంథాలయ అధికారి వి.శిరీష అన్నారు. పోటీ తత్వంతోనే విద్యార్థులు భవిష్యత్తులో రాణించగలరని పేర్కొన్నారు. వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా రోజుకో ప్రత్యేక కార్యక్రన్ని నిర్వహిస్తున్నామన్నారు. వీటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాల్సిందిగా సూచించారు. పలు పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికుల తొలగింపు అన్యాయం



కాంట్రాక్ట్ కార్మికులనుద్దేశించి మాట్లాడుతున్న సత్యనారాయణమూర్తి

- తక్షణమే విధుల్లోకి తీసుకోవాలి
- అవసరమైతే ప్రజాప్రతినిధుల ఇళ్లు ముట్టడిస్తాం
- సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణ

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ కార్మికుల నిరవధిక సమ్మెకు సీపీఐ రాష్ట్ర సమితి సంపూర్ణ మద్దతు ఇస్తుందని ఆ పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి జె.వి. సత్యనారాయణమూర్తి ప్రకటించారు. ఉక్కు పరిపాలన భవనం వద్ద బుధవారం చేపట్టిన ఆందోళనకు మద్దతు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాంట్ కోసం భూములు, ఇళ్లు కోల్పోయిన నిర్వాసితులు 8 వేల మందికి ఇప్పటికీ ఉద్యోగాలు లభించలేదన్నారు. ఎన్నికల ముందు ఉక్కు కర్మాగారాన్ని పరిరక్షిస్తామని, నిర్వాసితులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని ఇచ్చిన హామీని ప్రజాప్రతినిధులు విస్మరించడం దుర్మార్గమన్నారు. వెంటనే కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే ప్రజాప్రతినిధుల ఇళ్లను ముట్టడిస్తామన్నారు. ఉక్కు యాజమాన్యం కార్మికులను తొలగించడం సమంజసం కాదన్నారు. తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్మికులు 9 రోజులుగా నిరవధిక సమ్మె చేస్తున్నా యాజమాన్యంలో చలనం లేకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు షేక్ రహమాన్, కసిరెడ్డి సత్యనారాయణ, ఎం. మన్మథరావు, ఎన్. నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

యూపీహెచ్‌సీ సిబ్బందిపై డీఎంహెచ్‌వో ఆగ్రహం



నరసింహనగర్ యూపీహెచ్‌సీలో సమీక్షిస్తున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు

మహారాణిపేట: నరసింహనగర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు సందర్శించారు. ఈ యూపీహెచ్‌సీ పలు కార్యక్రమాల అమలులో వెనుకంజలో ఉండటంతో ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. అభ ఐడీ నమోదు, ఎన్‌సీడీసీడీ సర్వే, వ్యాధి నిరోధక టీకాల అమలు వేగవంతం కావాలని వైద్య సిబ్బందికి ఆదేశించారు. ఈ కార్యక్రమాల అమలులో నిర్లక్ష్యం తగదన్నారు. వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం ప్రణాళికాబద్ధంగా జరగాలని, నిర్దేశించిన సూచనల ప్రకారం వ్యాక్సిన్ తెచ్చుకోవాలని చెప్పారు. ముఖ్యంగా ఓపీ, ల్యాబ్ టెస్టులు, సాధారణ ప్రసవాల గురించి వైద్యాధికారులకు పలు సూచనలిచ్చారు. వైద్యులు, సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ఆశ కార్యకర్తలు తమ ఏఎన్ఎంలతో కలిసి గర్భిణులకు టీటీ, ఐరన్ ఫోలిక్ మాత్రలు అందేటట్లు, ఎనీమియా బారిన పడకుండా చూడాలన్నారు. సందర్శనలో జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ లూసీ, నోడల్ అధికారి డాక్టర్ బి.ఉమావతి, డీపీఎంవో, పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

గురుకుల హెల్త్ సూపర్‌వైజర్‌కు సేవారత్న పురస్కారం



గురుకుల విద్యాలయాల సంస్థ కార్యదర్శి చేతుల మీదుగా పురస్కారం అందుకుంటున్న కర్రి కన్నంనాయుడు

సబ్బవరం: స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో హెల్త్ సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న డాక్టర్ కర్రి కన్నంనాయుడు 2024–25 సంవత్సరానికిగాను ఉత్తమ ఆరోగ్య సేవారత్న పురస్కారాన్ని అందుకున్నారు. విజయవాడలోని ఏపీ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థలో సంస్థ కార్యదర్శి ప్రసన్న వెంకటేష్ చేతుల మీదుగా బుధవారం సత్కరించి, అవార్డుతో పాటు రూ.10 వేలు నగదు బహుమతిని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక్కో గురుకుల పాఠశాలలో 500 నుండి 600 మంది వరకూ విద్యార్థులుంటారని, వారి బాగోగుల్ని నిరంతరం పర్యవేక్షించే అవకాశం దక్కడాన్ని అదృష్టంగా భావిస్తున్నానన్నారు. కార్యక్రమంలో గురుకుల విద్యాలయాల సంస్థ అధికారులు, సబ్బవరం గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

క్రీడా దుస్తుల పంపిణీ



క్రీడా దుస్తులు అందజేస్తున్న ఆచార్య షారోన్ రాజ్

విశాఖ విద్య: ఆంధ్రా యూనివర్సిటీ విద్యా విభాగంలో బుధవారం మాజీ ముఖ్యమంత్రి ఎన్.టి. రామారావు జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆచార్య షారోన్ రాజ్ మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యా రంగం అభివృద్ధికి ఎన్టీఆర్ చేసిన కృషిని వివరించారు. ఏయూలో ఫుట్‌బాల్ క్రీడలో శిక్షణ పొందుతున్న విద్యార్థులకు ఆయన క్రీడా దుస్తులను బహూకరించారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనం, పోషకాహారాన్ని వితరణ చేశారు. డాక్టర్ ప్రకాష్, డాక్టర్ ఆలీ, డాక్టర్ రాము, పరిశోధకులు పాల్గొన్నారు.

◆ ఏయూలో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్. ధనుంజయరావు మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి, ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపరచడానికి ఎన్టీఆర్ చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. ఏయూ రెక్టర్ ఆచార్య ఎస్.కిషోర్‌బాబు, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎం.వి.ఆర్.రాజు, దూరవిద్య సంచాలకులు ఆచార్య ఎన్.విజయమోహన్, ఆచార్యులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

బూడిద లారీల రాకపోకలతో ఇబ్బందులు



పెదముషిడివాడ రహదారిలో వాహనాలతో ఎగసిపడుతున్న ధూళి

పరవాడ: లంకెలపాలెం–సబ్బవరం రహదారిలో రాకపోకలు సాగిస్తున్న ఫ్లైయాష్ లారీలతో భారీగా ధూళి ఎగసిపడుతోంది. దీంతో నరకయాతన పడుతున్నట్లు ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్టీపీసీ యాష్ పాండ్ నుంచి లంకెలపాలెం మీదుగా నిత్యం వందల సంఖ్యలో ఫ్లైయాష్ వాహనాలు నడుస్తున్నాయి ఈ భారీ వాహనాల వెనుక విపరీతంగా ధూలి రేగుతోంది. దీంతో ఎదురుగా వచ్చే వాహనాలను గుర్తించడం సాధ్యం కాక ప్రమాదాల బారిన పడుతున్నామని ప్రయాణికులు వాపోతున్నారు. గత నెల 2న ఎగసిపడిన ధూళి కారణంగా పెదముషిడివాడ సమీపంలో ఎదురుగా వస్తున్న గ్యాస్ ట్యాంకర్‌ను ఢీకొట్టి ఓ యువకుడు ప్రాణాలు కోల్పోయాడు. ప్రమాదాలకు గురై, క్షతగాత్రులైన వారి లెక్కలైతే అడగాల్సిన పనేలేదు. దీనికితోడు భారీ వాహనాల రాకపోకలతో రోడ్డు ఛిద్రమైంది. గజానికో గొయ్యి, అడుగుకో గుంతతో వాహన చోదకులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. రహదారిపై బూడిద లారీలను నియంత్రించాలని ఆయా గ్రామాల ప్రజలు పలు పర్యాయాలు ఆందోళనలు చేశారు. అయినా పట్టించుకునే నాథుడే లేడు. గుంతలతో నిండిన రోడ్డును సంక్రాంతికి ముందే పూడ్చి, మరమ్మతులు చేపడతామని హామీలు గుప్పించిన కూటమి నాయకులు సంక్రాంతి దాటి.. ఐదు మాసాలవుతున్నా వాటి అమలుకు కనీస చర్యలు చేపట్టట్లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ ఇబ్బందుల్ని గుర్తించి బూడిద లారీల నియంత్రణ, గుంతల పూడ్చివేతకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

శిథిల స్కూల్ భవనంతో భయాందోళన



శిథిలావస్థకు చేరి కూలేందుకు సిద్ధంగా ఉన్న పాఠశాల భవనం

పరవాడ: కలపాక శివారు పెద స్వయంభూవరం గ్రామంలో ప్రాథమికోన్నత పాఠశాల భవనం శిథిలావస్థకు చేరింది. ఏ క్షణాన కూలిపోతుందోనని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సింహాద్రి ఎన్టీపీసీ యాజమాన్యం ఇక్కడి యూపీ స్కూల్ విద్యార్థుల సౌకర్యార్థం 2002లో రూ.లక్షల వ్యయంతో దీన్ని నిర్మించింది. కొంత కాలం ఈ భవనంలో విద్యార్థులు చదువులు కొనసాగించారు. క్రమేపీ విద్యార్థుల సంఖ్య తగ్గిపోవడం మొదలైంది. దీంతోపాటు ఉన్న కాస్త విద్యార్థులను కూడా మూలస్వయంభూవరం పాఠశాలకు పంపించేశారు. అనంతరం ఈ భవనాన్ని నిరుపయోగంగా వదిలేశారు. దీని ఆలనాపాలనా చూసే నాథుడు లేకపోవడంతో భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరింది. పాడైన భవనాన్ని స్థానికులు కొన్నాళ్లు తమ పశువులశాలగా వినియోగించారు. పూర్తిగా శిథిలావస్థకు చేరి కూలే స్థితిలో ఉండటంతో పశువుల్ని కూడా ఆరుబయటే కడుతున్నారు. ఏదైనా ప్రమాదం ముంచుకు రాకముందే.. శిథిల భవనాన్ని తొలగించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

300 మందికి వైద్య పరీక్షలు



డాక్టర్ పద్మజను సత్కరిస్తున్న యూజ్ నాయకులు

అగనంపూడి: యూనియన్ ఆఫ్ స్టీల్ ఎంప్లాయిస్ (యూజ్) ఆధ్వర్యంలో అగనంపూడి ఏరియా ఆస్పత్రి వైద్యుల సహకారంతో 85వ వార్డు దానబోయినపాలెంలో బుధవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా వైద్యురాలు డాక్టర్ కణితి పద్మజా మాట్లాడుతూ సుమారు 50వేల మంది నిర్వాసితులు, నిరుపేదలు ఉన్న అగనంపూడి నిర్వాసితకాలనీల్లో ఉచిత వైద్య సేవలు అందించడం సంతోషంగా ఉందన్నారు. శిబిరంలో పాల్గొన్న గ్రామస్తులకు మాస్కులు, శానిటైజర్లు అందించారు. 300 మందికి ఉచిత వైద్యపరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు పరంధామయ్య, గుడే సుశీలా గజేంద్రరావు, బలిరెడ్డి సత్యనారాయణ, మడుగల నరసింగరావు, సాయిన సన్యాసిరావు, కిడిమి హనుమంతురావు, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆదమరిస్తే ప్రమాదమే...



ఎల్‌జీ పాలిమర్స్ జంక్షన్ వద్ద గుంత

గోపాలపట్నం: జీవీఎంసీ 92వ వార్డు ఎల్‌జీ పాలిమర్స్ జంక్షన్ వద్ద ప్రధాన రహదారిపై గోతులు ప్రమాదకరంగా ఉన్నాయి. వాహన చోదకులు ఆదమరిస్తే పెను ప్రమాదం తప్పదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గోపాలపట్నం నుంచి నాయుడు తోట వెళ్లే దారిలో ఎల్‌జీ పాలిమర్స్ జంక్షన్ వద్ద ఇటీవల పడిన వర్షాలకు రోడ్డు గుంతలా ఏర్పడింది. ఇది ప్రయాణికుల పాలిట ప్రమాదకరంగా తయారయింది. అలాగే ఎల్‌జీ పాలిమర్స్ జంక్షన్ నుంచి వెంకటాపురం వెళ్లే దారిలో జంక్షన్ సమీపంలో ఉన్న గుంత వాహన చోదకులకు కనిపించని విధంగా ఉంది. దీంతో వాహనాలు అదుపుతప్పి ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. వర్షాలు పెరిగితే గోతులు మరింత ప్రమాదకరంగా తయారవుతాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి గోతులను పూడ్చాలని కోరుతున్నారు.